స్వదేశీ వస్తువుల వినియోగంపై అవగాహన కల్పించాలి



మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన డాక్టర్ రావినూతల శశిధర్ తదితరులు

అబిడ్స్: కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నూతన కమిటీ నాయకులు కలిశారు. ఆదివారం మంత్రి కిషన్‌రెడ్డితో సమావేశమై గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..ప్రతి గణేష్ మండపం వద్ద స్వదేశీ వస్తువులను ప్రతి ఒక్కరూ వినియోగించే విధంగా మండప నిర్వాహకులు, గణేష్ ఉత్సవ సమితి నాయకులు ప్రచారం చేయాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సూచించిన విధంగా స్వదేశీ వస్తువులే ప్రజలంతా వాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. మండపాల వద్దకు వచ్చే వేలాది మందికి స్వదేశీ వస్తువుల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్, కార్యదర్శులు ఆలె భాస్కర్, మహిపాల్‌రెడ్డి, ఇతర నాయకులు బివి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు రుద్రాభిషేకం

డబీర్‌పురా: కోమటివాడిలోని శ్రీరామ మందిర్‌లో శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఈ నెల 18న సాయంత్రం 4.30 గంటలకు ఈశ్వరునికి పంచామృత సహిత రుద్రాభిషేకం, అన్నాభిషేకం, ఈశ్వరునికి అన్నంతో అలంకరణ, రాత్రి 7 గంటలకు షోడశోచార పూజ, మంగళ హారతి, తీర్థ ప్రసాదాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. బొంగులూరి రాంమూర్తి శాస్త్రి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాల సంక్షేమం



వాసు ముదిరాజ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దానం

అబిడ్స్: ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి, ప్రగతి కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఆదివారం గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వాసు ముదిరాజ్‌ను ఆయన సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాగేందర్ మాట్లాడుతూ..వాసు ముదిరాజ్30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ క్రమశిక్షణ గల నాయకుడిగా ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సంక్షేమం చేపట్టడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమన్నారు.

శ్రమదానం



గోల్కొండ: కుల్సుంపురా పార్కులో పచ్చదనాన్ని పెంచేందుకు వాకర్స్ అసోసియేషన్ తరఫున ఎన్నో రకాల పనులు చేస్తున్నామని కుల్సుంపురా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీధర్‌సాగర్ అన్నారు. ఆదివారం వాకర్స్ అసోసియేషన్ తరఫున పార్కులో పచ్చదనం పెంచేందుకు శ్రమదానం, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వాకర్స్ అసోసియేషన్ పార్కులో పచ్చదనం పెంచేందుకు చేస్తున్న కృషి సత్ఫలితాలు అందుతున్నాయన్నారు. పార్కులో తరచు తాము ప్రైవేటు ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, జొన్నకుంటి మధుసుధన్, నర్సింహ, శంకర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఒగ్గు కుమారస్వామి అన్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి తమిళనాడులో జరిగే సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు టీషర్టులు, నగదును ఆదివారం ఎల్బీస్టేడియంలో అందజేశారు. రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ క్రీడా కోచ్ రమాకాంత్ కురుమ తదితరులు పాల్గొన్నారు.



హ్యాండ్‌బాల్ క్రీడాకారులతో కుమారస్వామి తదితరులు

ఆగస్టు వర్షాలు..

కూలుతున్న శిథిల భవనాలు



పురాతన భవనం కూల్చివేస్తున్న దృశ్యం (ఫైల్)



హుస్సేనీ ఆలంలోని వందేళ్లకు పైబడిన పురాతన భవనం కుప్పకూలిన దృశ్యం (ఫైల్)

- చార్మినార్ జోన్ పరిధిలో 288 పురాతన భవనాలు
- వారం రోజుల్లో రెండిళ్లు నేలమట్టం
- బెంబేలెత్తుతున్న జనం

చార్మినార్: ఆగస్టు మాసంలో వర్షాలు పడుతున్నాయంటే పాతబస్తీ ప్రజలు వణికిపోతున్నారు. ఎందుకంటే ఆగస్టులో ఎడతెరిపి లేకుండా కురిసే భారీ వర్షాలకు పాతబస్తీ అతలాకుతలం అవుతుంది. ముఖ్యంగా రోజుల తరబడి కురుస్తున్న భారీ వర్షాలకు పురాతన భవనాలు తడిసి ముద్దై కుప్పకూలుతున్నాయి. గత వారం రోజుల్లో చార్మినార్‌లో వందేళ్లకు పైబడిన రెండు పురాతన భవనాలు కుప్పకూలాయి. అదృష్టావశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అయితే గతంలో జరిగిన పలు ఘటనల్లో పురాతన భవనాలు కూలి భారీ సంఖ్యలో ప్రాణనష్టం జరిగింది. జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలో దాదాపు 288 భవనాలు శిథిలావస్థకు చేరుకొని కూలడానికి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో దాదాపు 13 హెరిటేజ్ కట్టడాలుగా గుర్తించారు.

మరమ్మతులు చేపట్టకపోవడంతో..

పాతబస్తీలోని పురాతన భవనాలు స్థానికులకు దడ పుట్టిస్తున్నాయి. పాత భవనాలకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో నిజాం కాలం నాటి గోడలు తడిసి ముద్దయి కూలిపోవడానికి సిద్ధంగా మారుతున్నాయి. రోడ్లకు ఇరువైపులా అక్కడక్కడా ఈ పురాతన భవనాలు ఉండడంతో వాటి పక్క నుంచి వెళ్లడానికి పాదచారులు, వాహనదారులు జంకుతున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉండగా..ఆ దిశలో సంబంధిత యజమానులు స్పందించడం లేదు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నందున పురాతన భవనాలకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. సాంకేతిక కారణాల వల్ల కొన్ని ప్రాంతాల్లోని శిథిలావస్థలో ఉన్న భవనాలను సంబంధిత బల్దియా అధికారులు కూల్చివేయలేకపోతున్నారు.

గతంలో ఆగస్టులో జరిగిన కొన్ని ఘటనలు..

◆ 9 ఆగస్టు 2008లో భారీ వర్షానికి పంజెషాలోని పురాతన ఇల్లు కూలి ముగ్గురు కుటుంబసభ్యులు మృతిచెందగా ఇద్దరు స్వల్ప గాయాలకు గురయ్యారు. తెల్లవారుజామున మూడున్నర గంటలకు జరిగిన ఈ ఘటనలో ఇంట్లో నిద్రిస్తున్న మీర్ హసన్ అలీ ఖాన్ అలియాస్ అబ్దుల్ పాషా (60), అతని భార్య షంసున్నిసాబేగం అలియాస్ షహజాది బేగం(50) కుమారుడు మీర్ ఇషా జహీర్‌పాషా(32) తదితరులు మరణించారు. గోడ కూలడంతో ఇంట్లో ఉన్న విద్యుత్ షాక్ సర్క్యూట్‌కు గురయ్యింది. విద్యుద్ఘాతంతో ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. మరో గదిలో ఉన్న ఫయీమున్నిసా(40), రహీమున్నిసా(22) తదితరులకు స్వల్ప గాయాలయ్యాయి.

◆ 18 ఆగస్టు 2009లో రాత్రి కురిసిన భారీ వర్షానికి హెరిటేజ్ కట్టడమైన యునానీ ఆసుపత్రి భవనం (మక్కా మసీదు వైపు ఉన్న) ప్రధాన గోపురం, చార్మినార్ వైపు ఉన్న మినార్‌ల పెచ్చులు కుప్పకూలాయి.

◆ 31 ఆగస్టు 2009లో ఒకే రోజు రెండు పురాతన భవనాలు, రెండు ఇళ్ల గోడలు నెలకొరిగాయి. కోమటివాడి బోదేఅలీషా కిడికిలో ఓ పెంకుటిల్లు నేలకొరిగింది. కోమటివాడి ప్రధాన రోడ్డుపై ఓ పురాతన భవనం కుప్పకూలింది. అలాగే దక్షిణ మండలం డీసీపీ కార్యాలయం ప్రహరీ కూడా కూలిపోయింది. చార్‌కమాన్ రోడ్డులోని ఓ ఇంటి పురాతన గోడ కూలింది.

◆ 25 ఆగస్టు 2010లో డబీర్‌పురా–దారుషిఫాలో రాత్రి 12 గంటలకు 60 ఏళ్లకు పైబడిన పురాతన భవనంలోని కొంత భాగం కుప్పకూలింది. ఈ భవనంలో ఎనిమిది మంది కుటుంబ సభ్యులుండగా జరీనాఖాన్ అనే మహిళ తీవ్ర గాయాలకు గురయ్యింది.

◆ 30 ఆగస్టు 2010లో రోజంతా కురిసిన భారీ వర్షానికి పూల్‌బాగ్‌లోని అహ్మద్ కాలనీలోని ఓ ఇల్లు కుప్పకూలడంతో సోహేల్, హీనా, తాహేర్ అనే చిన్నారులు అక్కడికక్కడే మృతి చెందగా..సబియా అనే మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

తగిన చర్యలు తీసుకుంటున్నాం..



పాతబస్తీలో శిథిలావస్థకు చేరిన పురాతన భవనాలపై అవసరమైన మేరకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఇది వరకే మా ఇంజినీరింగ్ అధికారులు కొన్ని పురాతన భవనాలను పరిశీలించి నోటీసులు జారీ చేశారు. మరికొన్నింటినీ దగ్గరుండి మరీ తొలగింపు చేశారు. ఈ విషయంలో ఇళ్ల యజమానులు తమతో సహకరించాల్సిన అవసరం ఉంది.

– సోలీపేట శ్రీనివాస్ రెడ్డి, జోనల్ కమిషనర్

లలిత సంగీత పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న జి.వసుంధర తదితరులు

సుల్తాన్‌బజార్: పద లాలిత్యం, భావ సౌందర్యం లలిత సంగీతానికి ఆభరణాలని రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర అన్నారు. ఆదివారం సుల్తాన్‌బజార్ శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయంలో నవ్యనాటక సమితి నిర్వహించిన 26వ ఏవి.సావిత్రి లలిత సంగీత పోటీలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రముఖ గాయకుడు బి.వినోద్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..దేవులపల్లి కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు తదితరులు తమ రచనలకు లలిత సంగీతాన్ని సుసంపన్నం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వినోద్‌బాబు, డాక్టర్ నండూరి విద్యారణ్య స్వామి, వేమరాజు విజయ్‌కుమార్, ఆర్‌ఎస్.సుధారాణి, నిష్టల సుధామాల, సత్యవాణి, హరిబాబు, బాలాజీ శర్మ, కన్నారావు పాల్గొన్నారు.

పిల్లల మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం



అవగాహన కార్యక్రమంలో వైద్యులు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు

సుల్తాన్‌బజార్: పిల్లల మానసిక ఆరోగ్యంపై తల్లిదండ్రులకు అవగాహన అవసరమని సంరక్ష హాస్పిటల్ డైరెక్టర్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ హరీష్ రాచూరి అన్నారు. సంరక్ష హాస్పిటల్, అలో పేరెంటింగ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ సంయుక్తాధ్వర్యంలో 'పిల్లల మానసిక ఆరోగ్యం' అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పిల్లల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, భారతీయ సంస్కృతిపై అవగాహన పెంపొందించాలన్నారు. పిల్లల ఎదుగుదలకు కావాల్సిన జాగ్రత్తలు తల్లిదండ్రులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెన్స్ డాక్టర్ ఎం.సుధా, డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ సంపత్‌లతో పాటు చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వినాయక మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రమేష్‌నాయక్

గోల్కొండ: వినాయక మండపాల నిర్వాహకులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని టోలిచౌకీ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్‌నాయక్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ అజీజ్‌బాగ్‌లోని పోలీస్‌స్టేషన్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా అన్ని రకాల అనుమతులు తీసుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాల్సి బాధ్యత పోలీసులపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకీ, షేక్‌పేట్ తదితర ప్రాంతాలకు చెందిన వినాయక మండపాల నిర్వాహకులతో పాటు డీవ బాల్‌రాజ్ తదితరులున్నారు.

భారతీయ సంస్కృతి ఎంతో గొప్పది



కళాకారులతో సినీ నటుడు సుమన్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: భారతీయ సంస్కృతి ఎంతో గొప్పదని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచదర్‌రావు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రావణ సుమనోహరాలు అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విదేశాలలో సైతం మన సంస్కృతికి ఎంతో ఆదరణ ఉందని కొనియాడారు. కానీ మన దేశంలోనే మన సంస్కృతిని విస్మరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు కళాకారులను ఘనంగా సత్కరించారు. అంతకు ముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సినీనటుడు సుమన్, యువ కళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, సంస్థ అధ్యక్షురాలు పాలపర్తి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

'విశ్వసనీయత కోల్పోతున్న ఈసీ'



పాతబస్తీలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చార్మినార్: ఓట్ చోరీపై కాంగ్రెస్ పార్టీ తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమైందని పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు అన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆదివారం నుంచి బిహార్‌లో చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రకు సంఘీ భావంగా పాతబస్తీలో కాంగ్రెస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఆదివారం లాల్ దర్వాజా మోడ్ నెహ్రూ విగ్రహం నుంచి శాలిబండ క్లాక్ టవర్ వరకు జరిగిన ర్యాలీలో చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముజీబ్ ఉల్లా షరీఫ్, నాయకులు కె.వెంకటేష్ పాల్గొని మోదీకి వ్యతిరేకంగా ప్ల కార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ద్వారా తప్పుడు ఓట్లను సృష్టించి బీజేపీ ఎన్నికల్లో తన బలాన్ని చాటుకుంటుందని తద్వారా ఈసీ విశ్వసనీయత కోల్పోయే పరిస్థితి నెలకొన్నందన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఈడీ, సీబీఐ,ఎన్నికల కమిషన్ (ఈసీ)ను తమ జేబు సంస్థలుగా మార్చుకుందని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మూసా ఖాసీం, కె.సురేష్ బాబు, తిరుపతి చంద్రశేఖర్, మీర్ హైదర్ అలీ జాఫ్రీ, అస్లామ్ షరీఫ్, మధు, నరసింహ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే గోషామహల్ అభివృద్ధి



కేటీఆర్‌ను కలిసిన ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: బీఆర్‌ఎస్ హయాంలోనే గోషామహల్ అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఆదివారం గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్, కేటీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని ఆనంద్‌కుమార్ గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేసి పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ హయాంలోనే కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌దే విజయమన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీని ప్రజలు అన్ని ప్రాంతాల్లో వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు.

పీస్ అండ్ మైత్రి కమిటీల సేవా కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శం

గోల్కొండ: పీస్ అండ్ మైత్రి కమిటీల ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని తప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ అభిలాష్ అన్నారు. ఆదివారం సౌత్ వెస్ట్ జోన్ సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సమావేశం తప్పాచబుత్రలోని ఏకేఎం ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సెంట్రల్ పీస్ అండ్ కమిటీ వారు నిరంతరం పేద బడుగు వర్గాలు, పేద విద్యార్థుల కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ముఖ్యంగా నిరుపేద విద్యార్థులకు నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు అందించడం ఒక గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు మోజామ్ ఖాన్, కౌసర్, ఇలియాస్, జైనులాబిదున్ ఆబేద్ తదితరులున్నారు.



పీస్ అండ్ మైత్రి కమిటీ సమావేశంలో తప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ అభిలాష్

రాయిపూర్ బయలుదేరిన కరాటే క్రీడాకారులు



జియాగూడ: ఈ నెల 20వ తేదీ వరకు రాయిపూర్‌లో జరుగనున్న 33వ ఏఐకే ఆఫ్ నేషనల్ కరాటే డో చాంపియన్‌షిప్ పోటీలకు తెలంగాణ నుంచి 20 మంది క్రీడాకారులు బయలుదేరినట్లు ఏఐకే ఆఫ్ సహా కోశాధికారి శ్రీబాలాజీ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..ఇటీవల తెలంగాణ రాష్ట్ర స్థాయిలో జరిగిన కరాటే పోటీల్లో సుమారు 20 మంది క్రీడాకారులు గోల్డ్ మెడల్ సాధించి నేషనల్‌కు సెలక్ట్ అయ్యారని తెలిపారు. నేషనల్ చాంపియన్‌షిప్‌కు పోటీ పడుతున్న క్రీడాకారులు మల్లూంకర్ సంజనా, జి.నరేష్, కె.గోపాల్, ఆమోఘ, సిద్దార్థ, ఆర్తిపోల్, కె.మహేష్, కియాన్, సాయికిరణ్ ఉన్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్ త్రివేణి సంగం ఒడ్డున ఉన్న జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి తర్వాత శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో రాత్రి 9గంటల నుంచి భజనలు, జాగరణ కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు ఆడిపాడారు. అర్ధరాత్రి 12 గంటలకు తల్లిగర్భం నుంచి బయటకు జన్మించిన ఆ కన్నయ్య జనన వేడుక నయనానందకంగా జరిగింది. అనంతరం చిన్ని కృష్ణుడికి పంచామృతాభిషేకాలు, పండ్లాభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. తదనంతరం చిన్ని గోపాలుడిని అద్దాల మండపంలో ఊయలలో పెట్టి ఊపారు.



గురువులను సత్కరించుకోవడం మన సంప్రదాయం



గురువు మంజుల శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ప్రమోద్‌కుమార్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: గురువులను సత్కరించుకోవడం మన సంప్రదాయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అభినేత్రి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో ప్రణామ్ పేరిట గురు సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ ప్రభుత్వ సంగీత కళాశాలలో భరతనాట్య ఉపాధ్యాయురాలు మంజుల శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె దగ్గర విద్య నేర్చుకున్న శిష్యులు వివిధ అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గత కొన్ని సంవత్సరాలుగా విద్యను నేర్చుకున్న శిష్యులు అద్భుతంగా నృత్యం చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం 250 మంది విద్యార్థులచే గురువలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని నాట్య గురువులు సుందరి రవిచంద్ర, లలిత వినోద్, మాదవి శర్మ, సంస్థ అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఉట్టి కొట్టి .. సందడి చేసిన చిన్నారులు



మంగళ్‌హాట్ పూసల బస్తీలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

అబిడ్స్: మంగళ్‌హాట్ పూసలబస్తీలో జోరుగా శ్రీకృష్ణ జన్మాష్టమి ఉట్టి కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ వాస్తుశిల్పి, ఆర్కిటెక్ ఇంజినీర్ ఆవుల కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ ఆవుల అరుణల ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేషధారణ పోటీలు, ఉట్టి వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం బాలబాలికలకు శ్రీకృష్ణ, యశోద, రాధ, గొల్లభామల వేషధారణ పోటీలు చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు ఉట్ల కార్యక్రమం నిర్వహించారు. మంగళ్‌హాట్ పూసలబస్తీతో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి తిలకించారు. వేషధారణ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదాలు ఆవుల కృష్ణారావు, ఆవుల అరుణల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పండరీనాథ్



చాంద్రాయణగుట్ట: బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల పండరీనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా పండరీనాథ్ మాట్లాడుతూ..పార్టీలో బూత్ స్థాయి నుంచి కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. ఆయనతో పాటు జిల్లా ఉపాధ్యక్షులుగా పొన్న వెంకటరమణ, జాలిగం చిరంజీవి, జిల్లా కార్యదర్శిగా జె.నవీన్ యాదవ్, కోశాధికారిగా మామిడాల స్వప్న, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా మహేందర్‌రెడ్డి నియమితులయ్యారు.

నేటి నుంచి ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు

గోల్కొండ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని చెక్ లైఫ్ డయాగ్నొస్టిక్ అండ్ స్పెషాల్టి సెంటర్‌కు చెందిన డాక్టర్ రూబీనా మల్కీ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు థైరాయిడ్, టీ–3, 4, యూరిక్ యాసిడ్, బ్లెడ్ యూరియా తదితర టెస్టులను నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ఇతర వివరాలకు 9030519494లో సంప్రదించవచ్చు.

సందర్శకుల సందడి



గోల్కొండ కోట వద్ద పర్యాటకుల సందడి

గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులతో కిటకిటలాడింది. సెలవులు కావడంతో రెండు రోజులుగా పర్యాటకులు భారీ సంఖ్యలో వస్తున్నారని గోల్కొండ కోట సీనియర్ పరిరక్షణ అధికారి మల్లేశం తెలిపారు. ఆదివారం ఉదయం నుంచే కోటలో పర్యాటకుల తాకిడి మొదలైంది. పర్యాటకులతో గోల్కొండలోని నగీనాబాగ్, ఆయుధాగారం, అక్కన్న మాదన్న కార్యాలయం, సైనికుల బ్యారెక్స్ తదితర ప్రాంతాలు సందడిగా మారాయి. వేల సంఖ్యలో వచ్చిన పర్యాటకులతో గోల్కొండ చౌరస్తా, బడాబజార్, బాలాహిస్సార్ తదితర ప్రాంతాల్లోని షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.